సాక్షి విశాఖపట్నం

బుధవారం। 19 । ఏప్రిల్ । 2023



క్లీన్ సిటీ.. మన లక్ష్యం

మహా నగరం నిరంతరం పరిశుభ్రంగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. 8లో



చందనోత్సవ టికెట్ల విక్రయాలు

అప్పన్న చందనోత్సవం టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్‌లో రూ.300, రూ.1000 టికెట్లను ఉంచారు. 8లో

వెంకీమామ న్యూలుక్



విక్టరీ వెంకటేష్ న్యూలుక్‌లో అదరగొట్టారు. సైంధవ్ సినిమా కోసం వెంకీ ఇలా రెడీ అయ్యారు. 8లో

న్యూస్‌రీల్

నేడు సీఎం వైఎస్ జగన్ రాక

- ఎయిర్‌పోర్టులో ట్రాన్సిట్ హాల్ట్
- హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లాకు..



మహారాణిపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి బుధవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 9.20 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 9.30 గంటలకు హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట బయలుదేరుతారు. మూలపేట పోర్టు నిర్మాణానికి శంకుస్థాపనతోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు సీఎం విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. ఇక్కడ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

నేడు శ్రీప్రకాష్‌లో 'కేరింతలు' కార్యక్రమం

ముఖ్య అతిథిగా సాక్షి సంపాదకులు వి.మురళి

పాయకరావుపేట: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో బుధవారం 'కేరింతలు 2023' కార్యక్రమం జరగనుంది. ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న సుమారు 800 మంది విద్యార్థులతో ఆంధ్రవైభవాన్ని కీర్తిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను నృత్య, నాటక, గేయ రూపంలో ప్రదర్శించనున్నట్టు విద్యాసంస్థ సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్.మూర్తి తెలిపారు. మన చిట్టి గేయాలు, మన దేవాలయాలు, మన పండుగలు, మన ఆటలు, మన నృత్యాలు, మన నాయకులు, మన కవులు, మన జాతరలు, మన వృత్తులు, మన దేశం, మన జెండా గురించి చిన్నారులు ఈ కేరింతలు కార్యక్రమం ద్వారా తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాక్షి దినపత్రిక సంపాదకులు వర్ధెల్లి మురళి, గౌరవ అతిథిగా డెక్కన్ ఫైన్ కెమికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఆనందరావులు హాజరవుతున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేటి నుంచి పది మూల్యాంకనం

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల మూల్యాంకనం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. క్వీన్ మేరీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇందుకోసమని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నెల 26 నాటికి మూల్యాంకనం పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందుకోసం 2,095 మందికి విధులు కేటాయించారు. మూల్యాంకనం విధులు కేటాయించిన ఉపాధ్యాయులు మంగళవారం క్వీన్ మేరీ స్కూల్‌కు చేరుకుని అంగీకార పత్రాలను అందజేశారు. డీఈవో ఎల్. చంద్రకళ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీ మోహన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

21న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. అరబిందో ఫార్మా, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మా, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్, జయభేరి ఆటో మొబైల్స్, సుగుణ ఫుడ్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో 723 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. బ్రాంచ్ మేనేజర్, సేల్స్ మేనేజర్, జూనియర్ కెమిస్ట్, ఫార్మాసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ టీమ్ లీడర్స్, టెక్నీషియన్స్, సర్వీసు అడ్వైజర్లు, సేల్స్ కన్సల్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్, గూడ్స్ ఇన్‌చార్జి ఉద్యోగాలకు ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీకాం(టాలీ), బి.ఫార్మసీ, డి.ఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరేందుకు అవకాశం

ఆరిలోవ: విశాఖ వేలీ స్కూల్ సమీపంలోని ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో 2023–24 విద్యా సంవత్సరంలో శిక్షణ పొందడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ రవి తెలిపారు. ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరీ, బేకరీ అండ్ కన్‌ఫెక్షనరీ కోర్సుల్లో ఒక ఏడాది చదువుతో పాటు ఆరు నెలల పాటు ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. ఆయా కోర్సుల్లో చేరాలంటే 10వ తరగతి ఉత్తీర్ణత సాధించడంతో పాటు 2023 జూలై 1 నాటికి 25 ఏళ్లలోపు వయసు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 28 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు జూలై 25 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆరు నెలల కాలపరిమితితో ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 10వ తరగతి ఉత్తీర్ణులై.. 18 ఏళ్లు వయసు నిండని వారు అర్హులన్నారు. జూన్ 20 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 0891-2553883, 2952083లో సంప్రదించాలని సూచించారు.

ఈ-చలానా.. అయితే!

- వాహనచోదకుల్లో మారని తీరు
- ఫైన్లు వసూలు చేయడం లేదన్న ధీమాతో యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లంఘనలు
- ఒక్కో వాహనంపై 100కు పైగా చలాన్లు
- ఇటువంటి వారి ఆటకట్టించాలని పోలీసుల నిర్ణయం



దొండపర్తి: హెల్మెట్ ధరించరు.. వందకు పైగా వేగంతో వెళ్తారు.. సిగ్నల్స్ పడినా ఆగరు.. ట్రిపుల్ రైడింగ్ చేస్తారు.. ర్యాష్, జిగ్‌జాగ్ డ్రైవింగ్‌లో తోటి వాహనచోదకులను హడలెత్తిస్తారు. ఇలా ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే ఏమవుతుందో తెలుసా? మహా అయితే ఈ-చలానా పడుతుంది. అది కడితేనే కదా! మనం కట్టం. కట్టమని ఎవరూ అడగరు. కట్టని ఈ-చలానాలు ఎన్ని పడితే మనకేంటి బాస్! అంటూ సమాధానమిస్తున్నారు ఉల్లం'ఘనులు'. ఇలా అనుకుని మరింత రెచ్చిపోవాలనుకుంటే ఇక కుదరదు. ఎన్ని ఈ-చలానాలు వేసినా.. కొంత మంది వాహనచోదకులు తమ పద్ధతులను మార్చుకోకపోవడంతో కఠినంగా వ్యవహరించాలని పోలీసులు నిర్ణయానికి వచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపైనే కాకుండా ఈ-చలానాలు చెల్లించని వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. ఇలానైనా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తారన్న అభిప్రాయానికి వచ్చారు.

రూ.100 కోట్ల పైనే పెండింగ్ చలానాలు

ట్రాఫిక్ ఉల్లంఘనులపై రూ.100 కోట్లకు పైనే ఫైన్లు పెండింగ్‌లో ఉండడం పరిస్థితికి అద్దం పడుతోంది. 2021లో సుమారు 15 లక్షల చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి ద్వారా రూ.50 కోట్లు జరిమానాల రూపంలో పోలీస్ శాఖ వసూలు చేయాల్సి ఉంది. గతేడాది కూడా 9 లక్షల చలానాలతో రూ.22.30 కోట్లు పెండింగ్‌లో ఉంది. ఈ-చలానాలు విధానం ప్రారంభమైన నాటి నుంచి ఇలా ఏటా లక్షల చలానాలు పెరుగుతూనే ఉన్నాయి. కానీ 90 శాతం మంది వీటిని చెల్లించడం లేదు. ఈ చలానాలపై పోలీసులు దృష్టి పెట్టకపోవడంతో కొంత మంది వాహనచోదకులు మరింత రెచ్చిపోతున్నారు. ఈ-చలానా పడినా కట్టాల్సిన పని లేదన్న ధీమాతో నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారు. తోటి వాహనచోదకులను ఇబ్బందులకు గురి చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

కొందరిపై 150కి పైగా చలానాలు

నగరానికి చెందిన కొంత మంది వాహనదారులు ట్రాఫిక్ ఈ-చలానాల నమోదులో రికార్డు సృష్టిస్తున్నారు. వందకు పైగా చలానాలు.. రూ.వేలల్లో జరిమానాలతో ఇష్టారాజ్యంగా వాహనాలను నడుపుతున్నారు. వందకు పైగా ట్రాఫిక్ ఈ-చలానాలు కలిగిన టాప్ 20 వాహనదారుల జాబితాను పోలీసులు కొద్ది నెలల కిందటే సిద్ధం చేసింది. వీరిలో కొంత మందికి 150కి పైగా చలానాలు ఉన్నాయి. వీరి నుంచి ఫైన్లు వసూలు చేసే ప్రక్రియను చేపట్టింది. ఇప్పటికీ చాలా మంది తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో ఇటువంటి వారి జాబితాను మరోసారి సిద్ధం చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

జరిమానాల వసూళ్లపై దృష్టి

రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నడిపే వారిని ఇకపై ఉపేక్షించకూడదని పోలీసులు భావిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలపై కొన్నేళ్లుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ కొంత మంది వాహనచోదకుల్లో ఎటువంటి మార్పు రావడం లేదు. రోజురోజుకూ ఈ-చలానాలు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో చలానాలు వసూలు చేయాలని నిర్ణయించారు. నగరంలో ప్రతి జంక్షన్‌లోనూ ట్రాఫిక్ సిబ్బందితో పెండింగ్ చలానాల వసూళ్లకు సిద్ధమవుతున్నారు.

వాహనచోదకుల భద్రతకే ప్రాధాన్యం



వాహనచోదకుల భద్రతే మా తొలి ప్రాధాన్యం. రోడ్డు ప్రమాద రహిత విశాఖను తీర్చిదిద్దాలంటే కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సిందే. విశాఖలో రోడ్లు అద్భుతంగా ఉన్నాయి. దీంతో కొంత మంది వాహనచోదకులు అత్యంత వేగంగా వాహనాలు నడుపుతున్నారు. ముఖ్యంగా బీచ్‌రోడ్డులో ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై నిఘా పెడుతున్నాం. అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఈ-చలానాల వసూళ్లకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. రోజు రోజుకూ చలానాలు పెరిగిపోతున్నా.. ఏ ఒక్కరూ వాటిని చెల్లించడం లేదు. చలానాలు వసూలు చేయకపోవడంతో కొంత మంది వాహనచోదకుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

– త్రివిక్రమ్ వర్మ, నగర పోలీస్ కమిషనర్

'షిప్‌మంత్ర' కియోస్కులు!

- తొలుత ద్వారకా బస్‌స్టేషన్‌లో ఏర్పాటు
- త్వరలో గాజువాక, ఎంవీపీ, ఎన్‌ఏడీ, మధురవాడల్లో..
- దశల వారీగా అన్ని డిపోల్లోనూ అందుబాటులోకి..
- ఆర్టీసీ సిబ్బందితో డోర్ డెలివరీలపై అవగాహన



ద్వారకా బస్‌స్టేషన్‌లో కియోస్క్‌ను ప్రారంభిస్తున్న డీపీటీవో అప్పలనాయుడు

సాక్షి, విశాఖపట్నం : ఆర్టీసీ కార్గో సేవలు విస్తృతం చేయడానికి ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది. ప్రైవేటు పార్సిల్ సంస్థలకు దీటుగా సాంకేతికతను అందుబాటులోకి తెస్తోంది. ఇటీవల సరకు/పార్సిళ్ల ఇంటి నుంచే బుక్ చేసుకోవడం, ఇంటి వద్దకే డోర్ సదుపాయం పొందడానికి వీలుంటుంది. ఇందు కోసం షిప్‌మంత్ర అనే సంస్థతో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది. తొలుత విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ నగరాల్లోనే డోర్ డెలివరీ సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. ఈనెల 3వ తేదీ నుంచి శ్రీకాకుళం, విజయనగరం, రాజమండ్రి ప్రాంతాలకు కూడా షిప్‌మంత్ర డోర్ డెలివరీ సేవలను విస్తరించింది. కార్గో బుకింగ్, డోర్ డెలివరీ సేవలు పొందడానికి www.shipmantra.com యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆర్టీసీ కొత్తగా అందుబాటులోకి తెచ్చిన షిప్‌మంత్రను విస్తృతంగా ప్రచారం చేయడానికి 10 మందితో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం సభ్యులు షిప్‌మంత్ర ద్వారా అందే సేవలు, వినియోగం, ఇతర ప్రైవేటు పార్సిల్ సంస్థలకంటే ఆర్టీసీ షిప్‌మంత్ర తక్కువ చార్జీలు, సత్వర బట్వాడా, ఇంటి నుంచే బుకింగ్, డోర్ డెలివరీ వంటి ప్రయోజనాలను వివరిస్తున్నారు. దీనిపై ప్రయాణికులు, విద్యార్థులు, రెగ్యులర్ కస్టమర్లకు అవగాహన కల్పిస్తున్నారు. షిప్‌మంత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరుతున్నారు.

అందుబాటులోకి కియోస్కులు

ఇప్పుడు సరికొత్తగా షిప్‌మంత్ర కియోస్కులను ఆర్టీసీ బస్‌స్టేషన్లు, డిపోల్లో అందుబాటులోకి తెస్తున్నారు. తొలుత ప్రయోగాత్మకంగా మంగళవారం విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో దీనిని ఏర్పాటు చేశారు. ఈ బస్‌స్టేషన్‌కు వచ్చే వారికి, ఖాతాదార్లకు ఆర్టీసీ, షిప్‌మంత్ర సిబ్బంది ఈ కియోస్కు ద్వారా కార్గో/పార్సిల్ బుకింగ్, డోర్ డెలివరీ సదుపాయాలను వివరిస్తారు. దీనిలో ఉన్న నెట్‌వర్క్ సదుపాయాలతో పాటు ఆర్టీసీ కార్గో ద్వారా బుక్ చేసుకున్న సరకు/పార్సిల్ రాష్ట్రంలో ఎక్కడికైనా 24 గంటల్లోనే డెలివరీ అవుతుందని తెలియజేస్తారు. పైగా ప్రైవేటు పార్సిల్ సంస్థలకంటే వేగంతో పాటు 40–50 శాతం తక్కువ చార్జీ వసూలు చేస్తున్న విషయాన్ని చెబుతారు. ఇలా ఆర్టీసీ ప్రవేశపెట్టిన షిప్‌మంత్ర కార్గో సేవల ద్వారా ఎలాంటి ప్రయోజనాలుంటాయో ఈ కియోస్కుల వద్ద విశదీకరిస్తారు. త్వరలో గాజువాక, మధురవాడ, ఎంవీపీ బస్‌స్టేషన్లతో పాటు ఎన్‌ఏడీలోను కియోస్కులను ఏర్పాటు చేయనున్నట్టు ఆర్టీసీ విశాఖ జిల్లా ఇన్‌చార్జి ప్రజా రవాణాధికారి (డీపీటీవో) బలిజి అప్పలనాయుడు 'సాక్షి'కి చెప్పారు. దశల వారీగా మిగిలిన డిపోలు, బస్‌స్టేషన్లలోనూ వీటిని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

శరవేగంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి

- నేడు రూ.4 వేల కోట్లతో నిర్మించే మూలపేట పోర్టుకు సీఎంచే శంకుస్థాపన
- 2025 కల్లా భోగాపురం ఎయిర్‌పోర్టులో తొలి విమానం
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకం
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతుందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజలకు మేలు జరిగేలా శ్రీకాకుళంలో బుధవారం రూ.4 వేల కోట్లతో మూలపేట పోర్టు నిర్మాణంతో పాటు బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, హిరమండలంలో వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మంత్రి మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో బుధవారం చారిత్రక ఘట్టానికి అంకురార్పణ జరగబోతోందని, పూర్తిగా వెనుకబడిన ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లా పారిశ్రామికంగా, ఆర్థికంగా పరిపుష్టి చెందాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న చర్యలు సఫలీకృతం కాబోతున్నాయని చెప్పారు. మూలపేట పోర్టు తొలిదశలో రూ.3000 కోట్లతో నాలుగు బెర్తులను నిర్మిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం భావనపాడు పోర్టు నిర్మిస్తామని మోసం చేసిందని, కానీ సీఎం జగన్ పోర్టు నిర్మిస్తామని ఇచ్చిన హామీని వాస్తవ రూపంలోకి తెస్తున్నారని చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తికావొస్తోందని, ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో రూ.170 కోట్లతో మరో ఫిషింగ్ హార్బర్ నిర్మించనున్నట్లు తెలిపారు. మూలపేట పోర్టు, సిక్స్ లేన్ల హైవే నిర్మాణం పూర్తయితే శ్రీకాకుళం జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. బందరు, రామాయపట్నం పోర్టుల నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రామాయపట్నం పోర్టుకు ఈ ఏడాది డిసెంబరు లేదా వచ్చే ఏడాది జనవరిలో తొలి నౌక వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో వచ్చిన ఎంవోయూలు ఒక్కొక్కటిగా కార్యరూపం దాలుస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే 99 సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చాయని తెలిపారు.

3న భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన

రూ. 3,500 కోట్లతో నిర్మించే భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వచ్చే నెల 3న సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారని మంత్రి చెప్పారు. 2025 సంవత్సరం నాటికి మొదటి విమానం భోగాపురం ఎయిర్‌పోర్టులో దిగాలన్నదే సీఎం ఆకాంక్ష అని చెప్పారు.

స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వమే నడపాలి

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకూడదన్నదే తమ ప్రభుత్వ విధానమని చెప్పారు. ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కార్మికులు చేపడుతున్న ఉద్యమాలకు రాష్ట్ర ప్రభుత్వం దన్నుగా నిలుస్తుందన్నారు. నష్టాల్లో ఉన్న అనేక పరిశ్రమలను నడుపుతున్న కేంద్ర ప్రభుత్వం.. స్టీల్ ప్లాంట్‌ను నడపడానికి ఎందుకు వెనకాడుతోందని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్రం, దాన్ని కొంటామంటూ తెలంగాణ ప్రభుత్వం విశాఖలో అలజడి సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తగ్గేదే లే!



- అనకాపల్లి జిల్లా కోటవురట్లలో 44.4 డిగ్రీలు
- పద్మనాభం, గంభీరంలో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- అనేక ప్రాంతాల్లో 42-44 డిగ్రీల మధ్య రికార్డు
- ఉమ్మడి విశాఖలో కొనసాగుతున్న సెగలు
- మరో మూడు రోజులు వడగాడ్పులు



పైప్ నీటితో దాహం తీర్చుకుంటున్న కాకి

సాక్షి, విశాఖపట్నం: ఎండలు యథావిధిగా మండుతున్నాయి. వడగాడ్పులు తగ్గేదే లే అంటున్నాయి. పైగా రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తున్నాయి. ఏప్రిల్ నెలలో సరికొత్త రికార్డును సృష్టిస్తున్నాయి. తీవ్ర ఎండలు, వడగాడ్పుల ధాటికి జనం విలవిల్లాడుతున్నారు. బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారు వడదెబ్బకు గురవుతున్నారు. వారం రోజుల నుంచి వేసవి తాపం అదుపు తప్పుతూనే ఉంది. మంగళవారం కూడా అంతకుమించి ఉష్ణతీవ్రత వెదజల్లింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏప్రిల్‌లో తొలిసారిగా 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదై రికార్డు నెలకొల్పింది.



సాధారణంగా ఏప్రిల్‌లో ఉమ్మడి విశాఖ జిల్లాలో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదు కావడం అరుదు. అలాంటిది వారం, పది రోజుల నుంచి విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పలుచోట్ల 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. మంగళవారం అనకాపల్లి జిల్లా కోటవురట్లలో 44.4 డిగ్రీలు, దేవరాపల్లిలో 44.1, విశాఖపట్నం జిల్లా పద్మనాభంలో 44.04, ఆనందపురం మండలం గంభీరంలో 44 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదై తమ ప్రతాపాన్ని చూపించాయి. ఇవి సాధారణకంటే 4–6 డిగ్రీలు అధికం. మరో మూడు రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ వడగాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ఒకవేళ తప్పనిసరై వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని వీరు సూచిస్తున్నారు.

మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత
అనకాపల్లి	కోటవురట్ల	44.40
అనకాపల్లి	దేవరాపల్లి	44.10
విశాఖపట్నం	పద్మనాభం	44.04
విశాఖపట్నం	గంభీరం	44.00
అనకాపల్లి	గాదిరాయి	43.54
అనకాపల్లి	రావికమతం	43.45
అనకాపల్లి	చోడవరం	43.53
అనకాపల్లి	నర్సీపట్నం	43.09
అల్లూరి	ఎర్రంపేట	42.63
అల్లూరి	కూనవరం	42.44
అల్లూరి	గంగవరం	42.15
విశాఖపట్నం	సింహాచలం	41.60
విశాఖపట్నం	ములగాడ	41.46

మృగాడు అరెస్ట్

- గతేడాది ఓ బాలికపై సాయికుమార్ అఘాయిత్యం
- ఆ కేసులో అరెస్ట్.. కండీషన్ బెయిల్‌పై ఇటీవల విడుదల
- తాజాగా మరో బాలికపై లైంగిక దాడి
- ప్రత్యేక బృందాలతో దర్యాప్తు



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: అభం శుభం తెలియని బాలికపై లైంగిక దాడికి పాల్పడిన మృగాడు సాయికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గతేడాది అక్టోబర్‌లో ఓ బాలికపై అతను లైంగిక దాడికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ఈ జనవరిలో కండీషన్ బెయిల్‌పై బయటకు వచ్చాడు. తాజాగా ఆరిలోవకు చెందిన తొమ్మిదేళ్ల బాలికను కిడ్నాప్ చేసి ముడసర్లోవలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి పశుత్వాన్ని ప్రదర్శించాడు. సాంకేతిక ఆధారాలతో సాయికుమార్‌ను అరెస్ట్ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ వెల్లడించారు. పోలీస్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు.

ఆరిలోవ ప్రాంతంలో నాలుగో తరగతి చదువుతున్న 9 ఏళ్ల బాలిక ఈ నెల 9వ తేదీన తన ఇంటి సమీపంలో ఆడుకుంటోంది. చినగదిలి ప్రాంతానికి చెందిన, ప్రస్తుతం రామాటాకీస్ ప్రాంతంలో ఓ హాస్టల్‌లో నివాసముంటున్న గొందెల సాయికుమార్ బైక్‌పై ఆ బాలిక వద్దకు వచ్చి ఆగాడు. ఆస్పత్రి చిరునామా అడిగి బాలికను అక్కడ నుంచి కిడ్నాప్ చేశాడు. ముడసర్లోవలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక ఇంటికి వెళ్లి తల్లికి విషయం చెప్పడంతో ఆమె ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ జి.సోమశేఖర్ కేసు నమోదు చేశారు. డీసీపీ(క్రైం) జి.నాగన్న, దిశ ఏసీపీ సి.హెచ్.వి వేకానంద, ఆరిలోవ సీఐతో పాటు ఎస్‌ఐ అప్పారావు, దిశ డబ్ల్యూఎస్‌ఐ యు.రూపవతిలతో రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు.

సీసీ కెమెరాల ఆధారంగా...

బాలిక చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. సాంకేతిక ఆధారాల ప్రకారం బాలికను బైక్‌పై తీసుకువెళ్లింది చినగదిలి ప్రాంతానికి చెందిన సాయికుమార్‌గా పోలీసులు గుర్తించారు. అతడిపై నిఘా పెట్టి ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గోశాల వద్ద అదుపులోకి తీసుకొని విచారించారు. బాలికపై అఘాయిత్యం చేసినట్లు అంగీకరించడంతో అతడిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి బైక్, పలు చోట్ల చోరీ చేసిన సెల్ ఫోన్లనుస్వాధీనం చేసుకున్నారు.

బెయిల్‌పై వచ్చి.. బాలికపై లైంగిక దాడి

సాయికుమార్ బీఎస్సీ మైక్రోబయాలజీ చేసి ఓ ల్యాబ్‌లో పనిచేస్తున్నాడు. గతేడాది అక్టోబర్ 29న ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు సాయికుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. ఈ ఏడాది జనవరి రెండో వారంలో కండీషన్ బెయిల్‌పై బయటకు వచ్చాడు. ప్రతి ఆదివారం ఆరిలోవ స్టేషన్‌కు వెళ్లి సంతకం చేస్తున్నాడు. రామాటాకీస్ ప్రాంతంలో ల్యాబ్‌లోనే కాకుండా బీచ్‌రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌కు నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు బాలికలపై పశుత్వాన్ని ప్రదర్శించిన సాయికుమార్‌కు కఠిన శిక్ష పడేలా చూస్తామని సీపీ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ స్పష్టం చేశారు.

గంజాయి చైన్‌ను బ్రేక్ చేయడమే లక్ష్యం

విశాఖలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు లేవని సీపీ తేల్చి చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా వాటిని రవాణా చేస్తున్న వారిపై గట్టి నిఘా పెట్టినట్లు వెల్లడించారు. కేవలం రవాణా చేసే వారిని అరెస్ట్ చేయడానికే పరిమితం కాకుండా.. అసలు సూత్రధారులను పట్టుకోవడంపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ మత్తు రవాణా లింక్స్‌ను బ్రేక్ చేయడమే తమ లక్ష్యమన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దుస్తులు, ఇతర వ్యాపారాలు చేస్తున్నామని.. ఇల్లు అద్దెకు దిగుతున్న వారి విషయంలో ఇంటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలా వచ్చే కొంత మంది గంజాయి రవాణాకు వారి ఇళ్లను కేంద్రంగా మార్చుకుంటున్నారని తెలిపారు. రవాణా చేసే వారిని అరెస్ట్ చేయడమే కాకుండా ఇంటిని కూడా సీజ్ చేయాల్సిన పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. డీసీపీ–1 విద్యాసాగర్‌నాయుడు, దిశ ఏసీపీ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డిస్కంగా నిలిపేందుకు కృషి

- ఈపీడీసీఎల్ సీఎండీగా బాధ్యతలు చేపట్టిన పృథ్వి తేజ్



దొండపర్తి(విశాఖ దక్షిణ): దేశంలోనే ఉత్తమ డిస్కంగా ఏపీఈపీడీసీఎల్ నిలపడంలో తన వంతు కృషి చేస్తానని సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వితేజ్ పేర్కొన్నారు. ఏపీఈపీడీసీఎల్ నూతన సీఎండీగా ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీం(ఆర్‌డీఎస్ఎస్), జగనన్న హౌసింగ్ కాలనీల విద్యుద్దీకరణ, వ్యవసాయానికి పగటిపూట 9 గంటల విద్యుత్, 24/7 అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా, సంస్థ అందించే సేవలన్నింటిని వినియోగదారునికి చేరువ చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపడతానని చెప్పారు. భవిష్యత్తులో చేపట్టే అన్ని కార్యక్రమాలకు ఉద్యోగ సంఘాలు, యూనియన్ల నుంచి సహకారం తీసుకుంటానని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు, మరమ్మతు ఖర్చులు, ఆపరేషనల్–మెయింటెనెన్స్ వ్యయాలు తగ్గించటంపైన, సబ్‌స్టేషన్ ఆటోమేషన్‌కు గ్లోబల్ సాంకేతికత వినియోగం, విద్యుత్ చౌర్యాలను అరికట్టడం, నష్టాలను తగ్గించడం, ప్రివెంటివ్ మెయింటెనెన్స్, సాంకేతిక విధానాలు అమలు, సాంకేతికత, కృత్రిమ మేధస్సు పైన దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. తనకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.వి జయానంద్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన పృథ్వితేజ్‌కి ఈపీడీసీఎల్ నుంచి ఎస్‌పీడీసీఎల్ సీఎండీగా బదిలీపై వెళ్తున్న కె.సంతోషరావుతో పాటు సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఎ.వి.వి.సూర్యప్రతాప్, రాధికా అనుసూరి, సంస్థ అధికారులు స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన తొలివిడత చందనం అరగదీత

సింహాచలం : సింహగిరిపై గడిచిన మూడు రోజులుగా చేపట్టిన తొలి విడత చందనం అరగదీత మంగళవారంతో ముగిసింది. ఈ నెల 23న చందనోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి సమర్పించేందుకు కావాల్సిన మూడు మణుగుల పచ్చి చందనం (120 కిలోలు)ని సమకూర్చేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి అరగదీత ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మూడు రోజుల్లో కావాల్సిన చందనాన్ని సిబ్బంది అరగదీశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ చందనాన్ని తూకం వేసి బాండాగారంలో భద్రపరిచారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దినేష్‌రాజ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు తదితరులు పరిశీలించారు.

చికిత్స పొందుతూ ఖైదీ మృతి



వెంకటరమణ మృతదేహం

ఆరిలోవ : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి చెందాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తెలిపిన వివరాల ప్రకారం... పాడేరుకు చెందిన కె.వెంకటరమణ(35) ఎక్సైజ్ కేసులో నిందితుడు. ఈయన కొద్ది రోజులుగా విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉంటున్నాడు. అతను మద్యానికి బానిసయ్యాడు. జైల్‌కు వచ్చినప్పటి నుంచి సైకియాట్రికల్‌గా బాధపడుతున్నాడు. అతనికి శనివారం అర్ధరాత్రి తీవ్ర జ్వరం వచ్చింది. అదేరోజు ఒంటి గంటన్నర సమయంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇదిలా ఉండగా పది రోజుల క్రితం రమణ మరో ఖైదీతో గొడవపడినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఆ గొడవలో రమణ కంటిపై గాయమైందన్నారు. దీంతో అదేరోజు కేజీహెచ్‌కు తరలించగా అక్కడ వైద్యులు ఓ కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారని, అక్కడ ఆరోగ్యశ్రీ ద్వారా కంటికి చికిత్స అందించినట్లు తెలిపారు. దీంతో అతనికి కంటి గాయం నయమైందన్నారు. ఇప్పుడు తీవ్ర జ్వరంతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సూపరింటెండెంట్ వివరించారు.

కొట్లాటే మృతికి కారణమా..?

వెంకటరమణకు తోటి ఖైదీతో పది రోజుల క్రితం జరిగిన గొడవలో కంటిపైన తీవ్ర గాయం కావడంతోపాటు గుండెలపైన కూడా పిడిగుద్దులకు గురైనట్లు తెలిసింది. దీనివల్ల అప్పటికే ఆరోగ్యం బాగాలేని వెంకటరమణ మరింత అనారోగ్యానికి గురై మృతి చెంది ఉంటాడని సమాచారం. ఇదిలా ఉండగా జైల్ లోపల తరుచూ ఖైదీల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇక్కడ సుమారు రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు కొట్లాటలు జరిగాయి. గత నెలలో ఇద్దరు ఖైదీల మధ్య జరిగిన కొట్లాటలో ఓ ఖైదీ మరో ఖైదీకి ఇనుప చువ్వతో పొట్టపై పొడిచి గాయపరిచాడు.

క్లీన్ సిటీ.. మన లక్ష్యం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్/మధురవాడ: విశాఖ శుభ్రంగా ఉండాలని, పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించవద్దని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. జోన్- 4 పరిధి 31వ వార్డు, ఎంఎస్ఎఫ్-4, బీచ్‌రోడ్డులోని జీవీఎంసీ స్విమ్మింగ్ పూల్, కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ తదితర ప్రాంతాల్లో మంగళవారం కమిషనర్ పర్యటించారు. నగరంలో వ్యర్థాలు అక్కడక్కడ కనిపిస్తున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ శతశాతం జరగాలని స్పష్టం చేశారు. బీచ్ రోడ్డులోని జీవీఎంసీ స్విమ్మింగ్‌పూల్‌ను సందర్శించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాపులుప్పాడ డంపింగ్‌యార్డ్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న బయోమైనింగ్ పనులు పరిశీలించారు. అవసరమైతే మరో యూనిట్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్‌జైన్, అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, జోనల్ కమిషనర్లు శివప్రసాద్, కనక మహాలక్ష్మి, విజయలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీర్లు సత్యనారాయణరాజు, శ్యాంసన్‌రాజు, ఏఎంవోహెచ్ డాక్టర్ ఎన్.కిశోర్, కార్యనిర్వాహక ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

గెడ్డలను శుభ్రం చేయించండి

డాబాగార్డెన్స్: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నగరంలో ప్రధాన గెడ్డలను శుభ్రం చేయించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు ఉదయం 5.30 గంటలకే మస్తరు పాయింట్ వద్దకు రావాలని, 6 గంటలకు పనిలో నిమగ్నమయ్యేలా చూడాలన్నారు. క్లాప్ వాహనాలు ఉదయం 5.30 గంటలకు మస్తర్ పాయింట్ నుంచి బయలుదేరాలని, ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరణ 6 గంటల నుంచి మొదలుకావాలని ఆదేశించారు. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి బీచ్ వరకు పారిశుధ్యం మెరుగ్గా ఉండాలన్నారు. తీర ప్రాంతం వెంబడి మొక్కలు ఎండి పోకుండా పర్యవేక్షించాలని, విద్యుత్ దీపాలు అన్ని వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఆ ఇంటి యజమానులే నేరుగా డంపింగ్ యార్డ్‌కు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగించకుండా చర్యలు చేపట్టాలన్నారు. అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, చీఫ్ సిటీ ప్లానర్ సునీత, జోనల్ కమిషనర్లు, డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.



కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌లో బయో మైనింగ్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

చందనోత్సవంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

డాబాగార్డెన్స్: వరహా లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో భక్తులకు ఎటువంటి లోటుపాట్లు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో మంగళవారం సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు, జీవీఎంసీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, పార్కింగ్ తదితర పనులను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. భక్తులకు పంపిణీ చేసే ఆహార పదార్థాలు, పానీయాలను పేపర్ ప్లేట్లతో అందించేలా అవగాహన కల్పించాలన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళికాధికారి సునీత, జెడ్సీ మల్ల య్యనాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

చందనోత్సవ టికెట్ల విక్రయాలు ప్రారంభం

● ఆన్‌లైన్‌లో అందుబాటు

సింహాచలం : అప్పన్న చందనోత్సవం టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్‌లో రూ.300, రూ.1000 టికెట్లను అందుబాటులో ఉంచారు. ఈ నెల 23న జరిగే చందనోత్సవానికి భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో రూ.300 టికెట్టుపై వచ్చే భక్తులకు కూడా స్లాట్‌వారిగా అవకాశం కల్పిస్తుండడంతో ఆన్‌లైన్ విక్రయాలకు డిమాండ్ పెరిగింది. సింహాచలంలోని యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంకుల్లో ఆన్‌లైన్ టికెట్ల విక్రయాలకు అవకాశం కల్పించారు. అయితే తొలిరోజు టెక్నికల్ సమస్య ఎదురవడంతో భక్తులు నిరాశ చెందారు. మధ్యాహ్నం నుంచి రూ.300 టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. రూ.వెయ్యి టికెట్లు ఆన్‌లైన్‌లో పెట్టిన అరగంటకే విక్రయాలు జరిగిపోయాయని కొందరు, అసలు ఆన్‌లైన్ పెట్టలేదని మరికొందరు ఆరోపించారు. దీనిపై దేవస్థానం ఎస్టాబ్లిష్‌మెంట్ ఏఈవో ఆనంద్‌కుమార్‌ను వివరణ అడగ్గా ఉదయం టికెట్ల జారీలో టెక్నికల్ సమస్య వచ్చిన మాట వాస్తవమేనని ఆ తర్వాత సమస్య పరిష్కారమైందన్నారు. రూ.300 టికెట్లు రెండువేలు, రూ.1000 టికెట్లు రెండువేలు తొలిరోజు అందుబాటులో ఉంచామన్నారు.

సిద్ధమైన ఇళ్ల పట్టాలు పంపిణీ చేయండి

'రెవెన్యూ'సమీక్షలో కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: భూముల లావాదేవీలు జరిగినప్పుడు వెబ్‌ల్యాండ్‌లో ఎప్పటికప్పుడు మ్యుటేషన్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మంగళవారం ఆర్డీవోలు, తహసీల్దార్లు, వీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మీ-సేవ, ఏపీ సేవ, స్పందన ద్వారా ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఏపీఐఐసీ, ఎన్‌హెచ్ 16, రైల్వే భూములకు సంబంధించి మ్యుటేషన్ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. వైఎస్సార్ శాశ్వత భూ హక్కు, సర్వే పనులు నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీ ల్యాండ్ పూలింగ్ సమయంలో ఇళ్ల నిర్మాణానికి అనువైన భూములు సేకరించి.. అక్కడ అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. గాజువాక హౌసింగ్‌కు సంబంధించిన జీవో 301, 388పై ప్రజలకు సచివాలయాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్ల పట్టాలను ప్రజలకు వెంటనే అందించాలని ఆదేశించారు. జిల్లాలో శాశ్వత భవనాలు లేని తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు పంపాలని ఆర్డీవోలకు సూచించారు. రెవెన్యూ శాఖలోని నాలుగో తరగతి ఉద్యోగుల దీర్ఘ కాల సమస్యలను పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎస్డీసీలు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

కళారంగానికి తరగని ఆస్తి 'అల్లు'

నటుడు అల్లు రమేష్ కన్నుమూత



డాబాగార్డెన్స్: ఆప్యాయతల పలకరింపు ఆగిపోయింది. చిరునవ్వుల సేదతీర్చే అభిమాన చిరునవ్వుల జల్లు సెలవు తీసుకుంది. అటు వెండితెర..ఇటు బుల్లి తెర చిన్నబోయింది. ప్రముఖ రంగస్థల సినీ నటుడు అల్లు రమేష్ విశాఖలో కన్నుమూశారు. దీంతో నగర కళాభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అల్లు రమేష్ ఓ నటుడిగా, చిత్రకారుడిగా రసజ్ఞులైన ప్రేక్షకులకు తెలిస్తే, తోటి కళాకారులను ప్రోత్సహిస్తూ, ఎవరికి కష్టం వచ్చినా నేనున్నాంటూ మాట సాయం చేసే ఓ మంచి స్నేహితుడ్ని కోల్పోయామంటూ నాటకరంగ ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈటీవీ భాగవతం సీరియల్లో కుచేలుడి పాత్రలో ఒదిగిపోయాడు. కేరింత చిత్రంలో తండ్రి పాత్ర అందరికీ గుర్తుండుపోయే రీతిలో నటించి మెప్పు పొందాడు. తమిళ చిత్రం రావణ దేశంలో నటించారు. బ్లేడుబాబ్జి, నంది అవార్డు పొందిన చినుకు చిత్రంలో నటించారు. ఇటీవల మా విడాకులు వెబ్ సీరిస్‌లో తండ్రి పాత్రలో నటించి అందరి ప్రశంసలు పొందారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న కళారంగ ప్రముఖులు

అల్లు రమేష్ అంత్యక్రియలు మంగళవారం నగరంలోని ఓ శ్మశాన వాటికలో పలువురు కళారంగ ప్రముఖుల నడుమ జరిగాయి. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, బాదంగీర్ సాయి, హైమావతి, వర్రె నాంచారయ, చంద్రశేఖర్, ఎ.వీరేష్, కె. వేంకటేశ్వరరావు, సత్యప్రసాద్, జబర్దస్త్ ప్రకాష్, చలసాని కృష్ణప్రసాద్, బొబ్బా ధవళేశ్వరరావు, డాక్టర్ వి.త్రినాథరావు, టిన్‌సెకండ్స్ నాయుడు, ఆచారి, బుగత సత్యనారాయణ, ఎస్‌వీఎల్‌ఎన్ ప్రసాద్, కన్నబాబు, వియ్యపు చిన్నారావు, గిరిబాబు, మహిళా కళాకారులు హేమ, సంధ్యా, ప్రియదర్శినీ, రాజేశ్వరి, శాంతి రమేష్ బంధువులు అంత్యక్రియలో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరం



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్ : అగ్నిప్రమాదాల నివారణకు ప్రజల సహకారం కూడా ఉండాలని అగ్నిమాపక శాఖ సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సుబ్బారావు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల (గైస్)లో అగ్నిప్రమాదాల నివారణపై కాలేజీ సేఫ్టీ విభాగం, జిల్లా అగ్నిమాపక శాఖ సమన్వయంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ముందుగా పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణలో భాగంగా యంత్రాల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు యంత్రాలపై అధిక లోడు పడకుండా చూడాలని, వాటిని ఆపిన తర్వాత నిర్వహణ పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా నిర్వహణ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. పరిశ్రమల్లో విద్యుత్ సేఫ్టీతోపాటు ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్ణీత ప్రమాణాల మేరకు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాల నివారణ చర్యలను ప్రాక్టికల్‌గా చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ప్రసంగించారు. సేఫ్టీ విభాగం కరిక్యులమ్ కోఆర్డినేటరు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, కోర్సు కో ఆర్డినేటరు అలమండ వరహాలు, అగ్నిమాపక శాఖ లీడింగ్ ఫైర్ మన్‌లు చిరంజీవి, కృష్ణబాబు, ఫైర్ మన్‌లు ఆర్‌కే ఫరీద్, గజపతి, డ్రైవర్ (ఆపరేషన్స్) కె.నమశ్శివాయ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ విద్యార్థులు, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న ఇద్దరిపై కేసు

సీతమ్మధార: తిరుపతికి చెందిన యువతిని విశాఖకు చెందిన అనిల్‌కుమార్, అతని స్నేహితుడు ఆలీఖాన్ ఫోన్‌లో వేధిస్తున్నారు. దీంతో ఆ యువతి తిరుపతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విశాఖ ఫోర్త్ టౌన్‌కు బదిలీ చేశారు. వివరాలు ఇలా..తిరుపతికి చెందిన ఓ యువతిని విశాఖకు చెందిన అనిల్‌కుమార్ ఫేస్‌బుక్‌లో పరిచయమయ్యాడు. కొద్దిరోజులుగా ఫోన్‌లో మాట్లాడుతూ మరింత దగ్గరయ్యాడు. ఇటీవల ఆ యువతి సొంత పనిమీద విశాఖ వచ్చి సీతమ్మధారలోని ఓ హాస్టల్ ఉంటుందన్న సమాచారం తెలుసుకున్న అనిల్‌కుమార్ వెళ్లి కలిశాడు. మూడు రోజుల పాటు ఇద్దరూ వివిధ ప్రాంతాలను సందర్శించారు. వారిద్దరి మధ్య చిన్నపాటి గొడవ రావడంతో విడిపోయారు. యువతి తిరుపతి వెళ్లి పోయింది. అనిల్ కుమార్ స్నేహితుడు ఆలీఖాన్ యువతి ఫోన్ నంబర్ తీసుకొని వేధించడం మొదలు పెట్టాడు. దీంతో ఆమె తిరుపతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విశాఖలోని ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. వేధింపులకు పాల్పడుతున్న అనిల్‌కుమార్, ఆలీఖాన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి డీసీపీ-1 విద్యాసాగర్ నాయుడు ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'పీఎం శ్రీ'తో పాఠశాలల అభివృద్ధికి ఊతం

విశాఖ విద్య : విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం సైతం ఇతోధికంగా సాయం అందించేందుకు ముందుకొస్తోంది. నాడు-నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలు మార్చేసిన తీరు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇదే క్రమంలో జాతీయ విద్యా విధానం అమలుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, పాఠశాలల విలీన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఏ ఒక్క స్కూల్ కూడా మూతపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్న తీరును మెచ్చిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పాఠశాలల అభివృద్ధికి 'పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం'కింద నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. దీనిలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలివిడతలుగా 44 పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ మేరకు ఎంపికైన పాఠశాలల జాబితా కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం అధికారులు వెల్లడించారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులకు మంగళవారం సమాచారం వచ్చింది.

మౌలిక వసతులు పెంపు : ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. ఎంపికైన పాఠశాలల్లో ఏ మేరకు పనులు చేపట్టాలనే దానిపై జిల్లా స్థాయి కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయనుంది. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు అందాయి. నగరంలో న్యూకాలనీలో ఉన్న మున్సిపల్ హైస్కూలు, పద్మనాభం మండలం రేవడి, పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్, ఆనందపురం మండలంలోని జెడ్పీహెచ్ఎస్ ఎంపికయ్యాయి.

వెంకీమామ న్యూలుక్

కొమ్మాది: విక్టరీ వెంకటేష్ న్యూలుక్‌లో అదరగొట్టారు. సైంధవ్ సినిమా కోసం వెంకీ ఇలా రెడీ అవ్వగా.. ఈ గెటప్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. బీచ్‌రోడ్డులోని ఓ రిసార్ట్‌లో వెంకటేష్ ఇలా కనిపించడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. ఉక్కు నగరంలో గతం ఐదు రోజులుగా సైంధవ్ సినిమా చిత్రీకరణ జరుగుతున్న సంగతి తెలిసిందే.

6 కరోనా కేసుల నమోదు

మహారాణిపేట: నగరంలో మంగళవారం ఆరు కరోనా కేసులు నమోదయ్యాయి. 24 గంటల్లో 296 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 32కు చేరింది. నలుగురు డిశ్చార్జ్ అయ్యారు.

20న సస్టయినబులిటీ కాంక్లేవ్

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, విశాఖపట్నం(ఐఐఎంవీ) వేదికగా ఈ నెల 20వ తేదీన సస్టయిన బులిటీ కాంక్లేవ్‌ను నిర్వహిస్తున్నారు. భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ది నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్, డీపీఐఐటీ సౌజన్యంతో ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) సహకారంతో దీనిని నిర్వహిస్తున్నట్లు ఐఐఎంవీ సంచాలకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ప్రొడక్టివిటీ అండ్ గ్రీన్ గ్రోత్ అంశంపై ఈ కాంక్లేవ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని 2030 నాటికి 500 గిగావాట్‌కు పెంచడం లక్ష్యంగా భారత ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల నుంచి 50 శాతం వరకు ఇంధన అవసరాలను తీర్చే దిశగా ఇది నిలుస్తుందన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై మత్స్యకారులకు శిక్షణ



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రైనింగ్(సీఐఎఫ్ఎన్ఈటీ) విశాఖ యూనిట్, మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మత్స్యకారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఫిషింగ్ హార్బర్ సమీపంలోని సంస్థ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బోటు ఇంజిన్ లోపాలను సరిదిద్దడం, ఫిషింగ్ ప్రాక్టీస్ నిర్వహణ అన్న అంశంపై మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో జేసీ మాట్లాడారు. వేట చేస్తున్న సమయంలో నడి సముద్రంలో బోటు ఇంజిన్‌కు సాంకేతిక సమస్య ఏర్పడితే ఎలా పరిష్కరించుకుని ఒడ్డుకు చేరుకోవాలన్న అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్స్యశాఖ సంయుక్త సంచాలకురాలు జి.విజయ మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఈ శిక్షణ తరగతులు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. సీఐఎఫ్ఎన్ఈటీ డిప్యూటీ డైరెక్టర్ హృషికేష్ బిసోయ్ శిక్షణ ఉపయోగాలను వివరించారు. పలు శాఖల అధికారులు జి.వెంకటేశ్వర్లు, వి.ఎల్.పూజర్, వై.కృష్ణారావు, టి.వి.ఎస్.బి. హరనాథరావు తదితరులు మాట్లాడారు.

సింహాచలం డిపో డ్రైవర్‌కు ఢిల్లీలో సత్కారం



డ్రైవర్ రాజు

గోపాలపట్నం : ఒక్క ప్రమాదం కూడా చేయకుండా 34 ఏళ్లుగా ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్ఏఎస్ రాజుకు ఢిల్లీలో ఘన సత్కారం లభించింది. దేశంలో ఇటువంటి వారిని 42 మందిని గుర్తించి సత్కరించారు. సింహాచలం డిపోనకు చెందిన రాజుకు.. ఎంవోఆర్‌టీహెచ్ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. 1989లో సింహాచలం డిపోలో రాజు డ్రైవర్‌గా చేరారు. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో 18 అవార్డులు పొందారు. తనకు ఇంకా రెండు ఏళ్ల సర్వీసు ఉందని ఇదే స్ఫూర్తితో పని చేస్తానని రాజు తెలిపారు.

టిడ్కో గృహాలపై చర్చ



ఏపీ టిడ్కో చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: రానున్న రెండు నెలల్లో టిడ్కో గృహప్రవేశాలపై కలెక్టర్ మల్లికార్జునతో ఆ సంస్థ చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ చర్చించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మల్లికార్జునను ఆయన కలిశారు. లబ్ధిదారులకు అందజేయనున్న ఇళ్ల సంఖ్య, ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలు, వాటి పురోగతిపై చర్చించారు. దబ్బందలో ఏపీ టిడ్కో ద్వారా నిర్మిస్తున్న ఇళ్ల ప్రగతి, ఆ ప్రాంతంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆటంకంగా ఇబ్బందులను చైర్మన్ ప్రసన్నకుమార్ కలెక్టర్ మల్లికార్జున దృష్టికి తెచ్చారు. దబ్బంద లే అవుట్‌లో పలు సాంకేతిక సమస్యలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఎస్ఈ డి.నరసింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్, డీఈఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.